క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



కోయిల్‌కొండ: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకుడు జి.మనోజ్‌కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ వేసవికాలం కావడంతో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రాధకృష్ణ స్మారకార్థం చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండియాదవ్ కుమార్, జగన్, దస్తగిరి, శంకర్ రామస్వామి, నాగరాజు, పాషి, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాగులతో ఆరోగ్యం



అడ్డాకుల: రాగులు పిల్లల్లో జ్ఞాపకశక్తిని పెంచడంతో పాటు అనేక ఆరోగ్య లాభాలను కలిగిస్తాయని మండల ఆయుర్వేద డాక్టర్ కె.లావణ్య తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ఆయుష్ శాఖ ద్వారా మంగళవారం హెల్త్ అండ్ న్యూట్రిషియన్ కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంచడానికి మెమోరి కిట్, రాగి లడ్డులను అందజేశారు. రాగుల వల్ల విటమిన్ 'ఏ', క్యాల్షియంతో పాటు పీచు పదార్థం, ఖనిజ లవణాలు, అమైనో ఆసిడ్స్ పుష్కలంగా లభిస్తాయన్నారు. మెమోరీ కిట్లు జ్ఞాపకశక్తిని పెంచడంతో పాటు పిల్లల్లో భయాందోళనలను తగ్గిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ రంగన్నగౌడ్, హెచ్‌ఎం ఉమాపతిరెడ్డి పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం



మిడ్జిల్: మండలంలోని వస్పుల ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు 4వ తరగతి విద్యార్థులు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం రాలు ఇందిర, ఉపాధ్యాయులు మోహన్, గౌతమి, ఎస్‌ఎంసీ చైర్మన్ మాధవి పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయండి

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వారి సంక్షేమానికి ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలని అల్ ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తమ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ముస్లింల స్థితిగతులపై పలు కమిటీలు వేసినట్లు తెలిపారు. సచార్ కమిటీ, రంగనాథ్‌మిశ్రా కమిషన్‌లు కూడా ముస్లింలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని తమ నివేదికలో పేర్కొన్నాయని అన్నారు. ముస్లింల జీవనస్థితిగతుల్లో మార్పులు రావాలంటే రిజర్వేషన్లు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖూబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయప్ప పడిపూజ

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని కాంతిమల శిఖరంపై బుధవారం మహాపడి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురుస్వాములు శ్రీనివాస్, రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు హాజరు కావాలని కోరారు.

ఇద్దరికి గాయాలు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై మంగళవారం బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. తిమ్మాజిపేట మండలం అమ్మపల్లికి చెందిన సుల్తాన్, మహదేవ్‌లు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదంలో గాయాలు కాగా, అటుగా వెళ్తున్న తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి టోల్‌ప్లాజా సిబ్బందికి ఫోన్ చేసి అంబులెన్స్‌లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు.

గ్రాడ్యుయేషన్ డే



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం సమీపంలోని మౌంట్‌బాసిల్ హైస్కూల్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ప్రీ–ప్రైమరీ స్థాయి విద్యను ఉన్నత శ్రేణిలో పూర్తి చేసిన సందర్భంగా తల్లిదండ్రుల సమక్షంలో గ్రాడ్యుయేషన్ డిప్లొమాతో విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, డైరెక్టర్లు శిరీష, ప్రవీణ్‌కుమార్, సుశాంత్ కృష్ణ, కరస్పాండెంట్ పూజిత మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.ఇందుమతి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, కో–ఆర్డినేటర్ సౌమ్య, ఉపాధ్యాయులు సుజాత, శర్వాణి, లత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హోదా ఏమైంది?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- పాలమూరు–రంగారెడ్డిపై తొమ్మిదేళ్లుగా నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రం
- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: తొమ్మిదేళ్ల కిందట పాలమూరుకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని చెప్పారని, ఈ విషయమై రాష్ట్రంలోని బీజేపీ నాయకులు కేంద్రాన్ని ప్రశ్నించాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం భూత్పూర్‌లోని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై కోర్టులో కేసు వేయడంతోనే పూర్తి చేయడంలో ఆలస్యం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర, కర్ణాటకలో ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించి పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇప్పించేందుకు నిరాకరిస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు జిల్లాలో 14లక్షల మంది వలసలు వెళ్లి కరువు జిల్లాగా మార్చిన ఘనత గత పాలకులదే అన్న విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి కట్టుబడి నేడు అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి సస్యశ్యామలం చేశారని తెలిపారు.

అభివృద్ధికి నిధులు మంజూరు..

దేవరకద్ర నియోజకవర్గానికి రూ.16కోట్ల 83లక్షలు నిధులు మంజూరయ్యాయని, 32 తండాలు ఉండగా, 11తండాలకు బీటీ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి తండాకు, గ్రామంలో బీటీ రోడ్లు నిర్మాణం చేపట్టాలనే ఉద్దేశంతో పనులు చేపడుతున్నామన్నారు. భూత్పూర్ మండలంలోని మూడు తండాలకు రూ.4కోట్ల 25లక్షలు, చిన్నచింతకుంట మండలంలోని మూడు తండాలకు రూ.6కోట్ల 40లక్షలు, దేవరకద్ర మండలంలోని మూడు తండాలకు రూ.2కోట్ల 65లక్షలు, కొత్తకోట మండలానికి రూ.2కోట్ల 49లక్షలు, మదనాపురం మండలానికి రూ.కోటి 3లక్షలు మంజూరు కాగా, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రాజాపూర్: ఒకప్పుడు వ్యవసాయం దండుగ అన్న వారి నోళ్లు మూయించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి ఉమ్మడి పాలమూరును సస్యశ్యామలం చేశారని జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లి శివార్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు ఎందుకు తెలంగాణను అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, హరితహారం, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, రైతుబీమా, రైతుబంధు ఇవే కాకుండా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు. బీళ్లుగా ఉన్న భూముల్లో పంటలను సాగు చేసుకుంటున్నామని అన్నారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లో దేశ ప్రజల జీవితాలను ప్రధాని నరేంద్రమోడీ పెట్టి అదానీ, అంబానీల ఆదాయన్ని పెంచుతున్నారని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్యుడి నడ్డివిరుస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బాలానగర్ ఏఎంసీ మార్కెట్ చైర్మన్ రజిని జగన్ నాయక్, ఎంపీపీ సుశీల, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, దొండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

జడ్చర్ల: ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక 12వ వార్డులోని అనరాగిణి ఆశ్రమం ఆవరణలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్ రఘు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే పార్టీలో గుర్తింపు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: నాయకుడి నుంచి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వల్లభ్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఎంఈఓ రాములు, కాంగ్రెస్ నాయకుడు కిషోర్ సహ దాదాపు 100 మంది నాయకులు, కార్యకర్తలు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఏ బాధ్యతలు అప్పగించినా నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కౌన్సిలర్లు కిషోర్, సంధ్య శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు

పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

గండేడ్/మహమ్మదాబాద్: వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు రాకుండా చూసుకోవాలని పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గండేడ్ మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఉమ్మడి గండేడ్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాధవి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో వేసవి కారణంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అధిగమించడానికి అధికారులు పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడ సమస్యలు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. వచ్చిన నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా జరిగేలా చూడాలన్నారు. అనంతరం చౌదర్‌పల్లికి చెందిన చెంచులు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని కలిసి తమకు ఇళ్ల సౌకర్యం కల్పించాలని కోరారు.

సమస్యలపై చర్చ..

అంతకుముందు మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని, ట్యాంకు లీకేజీలు ఉన్నాయని సర్పంచ్‌లు నర్సమ్మ, పుల్లారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, గోపాల్, రవినాయక్, వెంకటయ్య, గీత, సత్యమ్మ ధ్వజమెత్తారు. ఏళ్ల తరబడి ఇదే సమస్య నెలకొందని ఆరోపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రాఘవాపూర్ నుంచి రెండు మండలాలకు తగినంత నీరు రావడం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు కూడా నివేదించామని తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని ప్రతి సమావేశంలో చెప్పినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి, పుల్లారెడ్డి, వెంకటయ్య, గోపాల్, రవీందర్ తదితరులు తెలిపారు. ఇందుకు ఇన్‌చార్జ్ ఏఈ వెంకటయ్య మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. చౌదర్‌పల్లిలో చెంచులకు గూడు కల్పించడం లేదని, అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని సర్పంచ్ వెంకటమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్‌ఐ యాదయ్య తెలిపారు. గ్రామాల్లో ప్రధాన రోడ్లపై కల్తీకల్లు విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని సల్కర్‌పేట్ సర్పంచ్ జితేందర్‌రెడ్డి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం సరిగా అందించడం లేదని పలువురు ఆరోపించారు. సమావేశంలో ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఇంతియాజ్, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, కోఆప్షన్ సభ్యుడు సలీం, వైద్యాధికారి చంద్రశేఖర్, పశువైద్యాధికారి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు



వీరభద్రుడి వేషధారణలో నృత్యాలు చేస్తున్న కళాకారులు

కోయిల్‌కొండ: కోరిన కోర్కెలు తీర్చే శైవుల ఆరాధ్యుడైన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. జిల్లా కేంద్రానికి 24కిలోమీటర్ల దూరం, మండల కేంద్రానికి 3కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆచార్యపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వీరభద్రస్వామి ఆలయం ప్రకృతి అందాల మధ్య ఎత్తయిన కొండపై వెలసింది. ఈ కొండపై వీరభద్రుడు, వినాయక, భద్రకాళి, శివాలయాలు ఉన్నాయి.

ప్రారంభమైన ఉత్సవాలు..

మంగళవారం పల్లకీసేవతో వీరన్న (వీరభద్రుడు) ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 5న ప్రభోత్సవం, 6న రథోత్సవం, 7న అగ్నిగుండం, 8న కల్యాణం, పూర్ణాహుతి, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాల్లో ప్రధానంగా ప్రతిరోజూ రాత్రి 11గంటలకు నిర్వహించే నందికోళ్ల సేవ భక్తులను ఎంగానో ఆకట్టుకుంటుంది. అగ్నిగుండం ముగిసే, నాగుపాముల ఆట ఉంటుంది. ఈ ఉత్సవాలు తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా తాండూర్, కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. పర్వదినాల్లోనే కాకుండా ఇతర సమయాల్లోనూ కొండపైకి భక్తులు వస్తుంటారు. కొండ దిగువన ఉన్న కోనేరులో స్నానమాచరించి అక్కడ చిన్న వీరభద్రస్వామిని దర్శించుకుంటారు.



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

అనంతరం కొండపై స్వయంభువై వెలసిన వీరభద్రస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. స్వామి వారికి రుద్రాభిషేకం చేయించి తమ మొక్కులు చెల్లించుకుంటే సంతాన ప్రాప్తికలుగుతుందని భక్తుల విశ్వాసం.

వీరభద్రుడి పల్లకీసేవ..

మండల కేంద్రంలో మంగళవారం తమ్మళి విజయ్‌కుమార్ స్వగృహం నుంచి శ్రీవీరభద్రస్వామిని పల్లకీసేవలో గ్రామపురవీధుల గుండా ఊరేగిస్తూ కోలాటాలు, నందికోళ్ల సేవ, పులి వేషాధరణలతో, భక్తుల భజనలతో ట్రాక్టర్‌పై పల్లకీసేవను ఊరేగించారు. అక్కడి నుంచి వీరభద్రస్వామిని కొండవరకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు కోయిల్‌కొండ స్వామి వివేకానంద చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బ్యాటరీ కంపెనీపై చర్యలు తీసుకోవాలి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

భూత్పూర్: పట్టణ సమీపంలో ఉన్న బ్యాటరీ కంపెనీ నుంచి వచ్చే పొల్యూషన్‌తో ఇబ్బందిగా ఉందని మున్సిపల్ కమిషనర్ నజీబ్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. పొల్యూషన్‌తో చుట్టుపక్కల ఉండే తండావాసులకు దుర్గంధం రావడంతో అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవీందర్, శ్రీనివాస్, ఫారూఖ్, సదానంద్, మల్లేష్, శ్రీశైలం, భీమ్‌రాజ్, రాజు ఉన్నారు.

డీఎస్పీ జన్మదిన వేడుకలు



కందూర్‌లో డీఎస్పీ కిషన్‌ను సత్కరిస్తున్న అభిమానులు

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం డీఎస్పీ బంటు కిషన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని శివలింగానికి డీఎస్పీ కిషన్‌తో అర్చకులు అభిషేకం చేయించారు. అనంతరం శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం కల్యాణ మండలంలో డీఎస్పీ అభిమానులు 75కిలోల భారీ కేక్‌ను కట్ చేయించి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జి.రామన్‌గౌడ్, రమేష్‌గౌడ్, పెద్దమందడి టీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేణుయాదవ్ పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



పాలమూరు: ఫార్మసీ విద్యార్థులకు భవిష్యత్‌లో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉంటాయని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పీయూ రిజిస్ట్రార్ గిరిజ మంగతయారు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సరోజిని రాములమ్మ ఫార్మసీ కళాశాలలో మంగళవారం గ్రాడ్యువేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా 2021–22విద్య సంవత్సరంలో కళాశాలలో చదివి ఉతీర్ణులైన విద్యార్థులకు పీయూ రిజిస్ట్రార్ గిరిజా మంగతయారు డిగ్రీ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బాలరాజు, ప్రిన్సిపాల్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గస్తీ మరింత పెంచాలి

బాలానగర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ మహేష్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి క్రైమ్ రేట్ గురించి ఆరాతీశారు. ఇటీవల బాలానగర్‌లో నమోదైన బాలిక ఈవ్‌టీజింగ్ కేసు విషయంలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు గస్తీ పెంచాలని ఆదేశించారు. వేసవిలో ఆరుబయట నిద్రించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ జములప్ప, ఎస్‌ఐ జయప్రసాద్ తదితరులు ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి



రాచాలలో పర్యటిస్తున్న కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్

అడ్డాకుల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను ఆదరించి గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని రాచాల, శాఖాపూర్ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. రూ.500లకు గ్యాస్ సిలిండర్ అందజేస్తామని అన్నారు. సామాన్యుల నడ్డీ విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అంతకుముందు గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతయ్య యాదవ్, వేణుగోపాల్, టీసీ శ్రీనివాస్, రాఘవేందర్‌గౌడ్, రాందాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, సునిత్‌కుమార్, సత్యనారాయణ, బాలచందర్ పాల్గొన్నారు.

చట్టపరమైన హక్కులు కల్పించండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జగపతిరావు

నవాబుపేట: సీనియర్ సిటిజన్లు తమ కుటుంబాల కోసం తమ జీవితాలను త్యాగం చేసి పోషిస్తే వారి రిటైర్మెంట్ అనంతరం వారికి సముచిత స్థానం లభించడం లేదని సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగి పదవీ విరమణ పొందిన అనంతరం వారికి చాలా సమస్యలు వస్తున్నాయని, 2007చట్టం ప్రకారం సీనియర్ సిటిజన్లకు చట్టపరమైన హక్కులు కల్పించారన్నారు. సమావేశంలో ఫోరం నాయకులు నాగభూషణం, విజయ్‌కుమార్, చంద్రశేఖర్, చిన్నస్వామి, వెంకటేశ్వరప్ప, వెంకటయ్య, శారదమ్మ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏడీఏ యశ్వంత్‌రావు

దేవరకద్ర రూరల్: రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన బిల్లులను తప్పనిసరిగా అందజేయలని ఏడీఏ యశ్వంత్‌రావు డీలర్లకు సూచించారు. వారం రోజుల కిందట 'అధిక ధరకు యూరియా' అనే శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనం ఆధారంగా మంగళవారం మండలంలోని ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. దుకాణాల్లో స్టాక్‌కు సంబంధించిన రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ రాజేందర్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణ ముఖ్యం



వరిపంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి కృపాకర్‌రెడ్డి

మహమ్మదాబాద్: వరిలో కాండం తొలుచు పురుగు పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కృపాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మొకర్లాబాద్, మంగంపేట్, చౌదర్‌పల్లి, గాదిర్యాల, ఎల్కిచర్ల తండా, నంచర్ల, దేశాయిపల్లి గ్రామాల్లో వరిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా చోట్ల వరిపైరును కాండం తొలుచు పరుగు ఆశిస్తుందన్నారు. దీని వల్ల పిలకలు, కంకులను నష్టపరుస్తుందన్నారు. నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు మౌనిక, రక్షిత పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, జేఏసీ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీ జేఏసీ ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో నిర్వహించనున్న మహనీయుల జయంత్యుత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే వంటి నేతలు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ రాజీకుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, బీసీ సెల్ డైరెక్టర్ ప్రవీణ, శైలేష్, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్య, కార్తీక్, పీయూ జేఏసీ చైర్మన్ రాము, వైస్ చైర్మన్ రూప్‌సింగ్‌నాయక్ కన్వీనర్ శ్రీవిద్యగౌడ్, ఎంఎస్‌ఎఫ్ అధికార ప్రతినిధి గణేష్ తదితరులు పాల్గొన్నారు.